క్లుప్తంగా

జాతీయ రహదారిలో ప్రమాదాల నియంత్రణకు చర్యలు



పామర్రు: నియోజకవర్గ పరిధిలోని విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రమాద ప్రదేశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేషనల్ హైవేలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను నిడుమోలు నుంచి గోపువానిపాలెం వరకు పరిశీలించామన్నారు. నేషనల్ హైవేకు చెందిన ఇంజినీర్‌తో మాట్లాడి ఆయా ప్రదేశాలలో బ్లింక్ లైట్లు, ప్రమాదహెచ్చరిక బోర్డులు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. పామర్రు సీఐ సుభాకర్, పామర్రు, పమిడిముక్కల ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మీకోసం'లో అర్జీలకు రశీదులు ఇవ్వటం లేదు

తోట్లవల్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం ప్రహసనంగా మారిందని బీసీ నాయకుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు ఆరోపించారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రొయ్యూరులో పలు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే మీకోసంలో అర్జీలు ఇస్తే రశీదులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యూరు క్వారీలో కొంతమంది వ్యక్తులు ఇష్టానుసారం బాటలు వేస్తూ ఇసుక అక్రమరవాణకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసినా తహసీల్దార్ స్పందించటం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

రేపు వెంకన్న ఆలయ హుండీల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ గ్రామంలోని శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపు గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఈఓ మాధవీలత తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

'రెండు నెలల్లో కొడాలి నాని అందుబాటులో ఉంటారు'

గుడివాడరూరల్: మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ విజయవంతంగా పూర్తయి ఆరోగ్యంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్జరీ తర్వాత కోవిడ్ దృష్ట్యా ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని వైద్యులు సూచించినందున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాద్‌లో ఉన్న కొడాలి నానిని కలిసేందుకు రావద్దని కోరారు. మరో రెండు నెలల్లో ఆయన అందరికీ అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఆధార్‌కార్డు లింక్ చేయండి

గుడివాడ టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు బదిలీ కావాలంటే ఆధార్ కార్డును బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానం తప్పనిసరి అని గుడివాడ పోస్టల్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎం. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు లిఖిత పూర్వక సందేశం ఇచ్చిందని పేర్కొన్నారు. జూన 5వ తేదీ లోగా లింకేజీ పూర్తికావాలని తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

గుడివాడరూరల్: లింగవరం గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని సామాజిక కార్యకర్త అత్తులూరి రవికుమార్ మంగళవారం మండల అధికారులకు విజ్ఞప్తి చేశారు. లింగవరం గ్రామంలో యోగాసనాలకు సంబంధించి తలపెట్టిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీడీఓ విష్ణుప్రసాద్‌కు గ్రామంలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ పంచాయతీ వారు గ్రామంలో సక్రమంగా తాగునీరు అందజేయడం లేదని తెలిపారు. వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని, శానిటేషన్ పనులు జరగడం లేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించేది ఎప్పుడో?

- జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ట్యాంక్ నిర్మాణం
- వైఎస్సార్ సీపీ పాలనలోనే రూ.2.30 కోట్లతో పనులు



నిరుపయోగంగా ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్

పామర్రు: గ్రామస్తులకు మంచి నీటి పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి ట్యాంక్ ద్వారా సురక్షిత తాగునీరు అందించాల్సి ఉంది. వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు పూర్తయినా ఇంత వరకు ట్యాంక్‌ను ప్రారంభించక పోవడంతో పలు ప్రాంతాల ప్రజలు తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో హర్ ఘర్ జల్ పథకంలో భాగంగా రూ.2.30 కోట్ల అంచనా విలువలతో 1.5 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్ (ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్) ట్యాంక్‌ను ఏడాది క్రితం వైఎస్సార్ సీపీ పాలనలోనే నిర్మించారు. ఈ ట్యాంక్ నుంచి సుమారు 9,478 మీటర్ల వరకు పైపు లైన్లు వేసి ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇంత వరకు పైపు లైన్ల పనులు ప్రారంభించలేదు. దీంతో గ్రామంలోని పలు ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు.

తాగునీటి ఇబ్బందులు

గ్రామంలోని సాయినగర్ ప్రజలకు వీధి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరాకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీరికి పంచాయతీ వారి వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంక్ ప్రారంభం అయితే ఆయా ప్రాంతాల వారికి తాగునీరు సక్రమంగా అందుతుంది. ఈ పథకం ప్రారంభం కాకపోవడంతో స్థానికులు తాగునీటికి అవస్థలుపడుతున్నారు. కొబ్బరితోట, అరండాల్ పేటలోని ఓ ప్రాంతానికి కూడా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి వస్తే ఇబ్బందులు ఉండబోవని ప్రజలు చెబుతున్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభించండి



పనులు పూర్తయిన వాటర్ ట్యాంక్‌ను వెంటనే ప్రారంభించాలి. తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్న వారికి సక్రమంగా తాగు నీరు అందించేలా తగు చర్యలు తీసుకోవాలి. ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాలి

– ఎ.శ్రీనాథ్‌రెడ్డి, పామర్రు

తాగునీరులేక ఇబ్బందులు



సురక్షిత తాగునీరు లేక దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ట్యాంక్‌ను ప్రారంభిస్తే ఇళ్ల వద్దనే సురక్షిత తాగునీరు తాగవచ్చు. సంబంధిత అధికారులు స్పందించి ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు ఇప్పించాలి. ట్యాంక్‌ను ప్రారంభించి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌వీ నాంచారయ్య, పామర్రు

ట్యాంక్ ప్రారంభించేందుకు చర్యలు

వాటర్ ట్యాంక్‌కు విద్యుత్ సరఫరా నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్ని అనివార్య కారణాలతో ఈ పనులకు ఆలస్యం అయింది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి వారం రోజుల్లో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నాం.

– రత్నారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పామర్రు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గుడివాడలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయఫ్లోరెన్స్

గుడివాడరూరల్: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయ ఫ్లోరెన్స్ పేర్కొన్నారు. స్థానిక 12వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం కిశోర బాలికలకు సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్‌నెట్, ఇతర ఆన్‌లైన్ ప్లాట్ ఫారాల ద్వారా జరిగే మోసాలు, హ్యాకింగ్, వ్యక్తిగత సమాచారం చోరీ తదితరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భవానీ, నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రక్త హీనత నుంచి రక్షణ

పామర్రు: కిశోర బాలికలను రక్త హీనత నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ భానుశ్రీ పేర్కొన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు సత్యశ్రీ, విజయకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

గుడ్లవల్లేరు: ఆన్‌లైన్ భద్రతపై కిశోర బాలికల వికాసం అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి సూచించారు. కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతులను మంగళవారం అంగలూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో డీసీపీయూ కౌన్సిలర్ జె.స్వరాజ్యం అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే ఈ కిశోర వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు.

కిశోర బాలికలకు యోగాసనాలు

కైకలూరు: యుక్త వయస్సు నుంచి యోగాసనాలు అభ్యాసనం చేయాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ వీ.దీప్తి పేర్కొన్నారు. ఆచవరం గ్రామంలో కిశోరి వికాసం – 2.0 కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు మంగళవారం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ యుక్త వయస్సు పిల్లలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం యోగాంధ్రాలో భాగంగా యోగాసనాలను నేర్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్ బి.కరుణ, ఎంఎస్‌కే ఆర్. విజయలక్ష్మి పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

భక్తులకు మజ్జిగ పంపిణీ

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో దాతల సహకారంతో భక్తులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేసినట్లు ఆలయ ఈఓ ప్రసాదరావు పేర్కొన్నారు. దాత గంధం వెంకట రమేష్ సౌజన్యంతో ఈ వితరణ జరిగిందని తెలిపారు. ఈనెల 29వ తేదీన ఆలయంలోని హుండీలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: తారక రామా వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో మంగళవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు ఎం. కిరణ్ కుమార్, చిన్నం ఫణి రాజ మహేష్–స్వర్ణ దంపతుల వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం.బ్రహ్మయ్య తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. యాదవ సేవా సంఘం తూర్పు గోదావరి జిల్లా శాఖ సభ్యులైన టి. సాయి మురళీకృష్ణ యాదవ్–మోహన్ లక్ష్మి దంపతుల వితరణతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరి కుమార్ తెలిపారు. ముఖ్య అతిథి టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ జరిగింది.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కౌతవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో తూము వెంకటరత్నం, మత్తి నాగన్న, శంకర్, శివశంకర్, మణికుమార్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు జరిపారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు విద్యుత్ ఫీడర్ల పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని ముదినేపల్లి సెక్షన్ విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగాపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో పలు ఆసనాలు వాటి ప్రయోజనాలను వివరించారు.

నీతి కథల బోధన

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన విద్యార్థులకు నీతి కథలు, ప్రముఖుల జీవిత చరిత్రలను బోధించి చదివించారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు నిర్వహించే తరగతులతో విజ్ఞానంతో చేకూరుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.

పామర్రులో..

జమీగొల్వేపల్లి(పామర్రు): పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు గ్రంథ పరిచయం ఏర్పడుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలో వేసవిశిక్షణలో భాగంగా మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు పద్యాలపై అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు.

వేసవి శిక్షణలు సంతృప్తికరం

గుడివాడ టౌన్: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. గ్రంథాలయ అధికారి పి. శాంతి, విశ్రాంత ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృక్షాలను నరకడం ఆపండి

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని అహింసా సాంప్రదాయ సేవా సంస్థ ఆస్పత్రికి చెందిన సుదీర్ఘ కాలంగా ఉన్న వృక్షాలను తొలగించవద్దని చిరు వ్యాపారులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్. మనోహర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరాలు పైబడి వయస్సు కలిగిన పెద్ద వృక్షాలు అక్కడ అనేక మందికి నీడను ఇస్తున్నాయని, ఆ నీడలో చిరు వ్యాపారులు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ చెట్లు తొలగించడం వలన అనేక మంది జీవనం కోల్పోతారన్నారు. చెట్ల తొలగింపును ఆపాలని విజ్ఞప్తి చేశారు.

31న పింఛన్ల పంపిణీ

గుడివాడరూరల్: జూన్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక్క రోజు ముందుగానే ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ విష్ణుప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ శనివారం పింఛన్లు అందజేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

అకాల వర్షాలతో మొక్కజొన్న రైతుకు కష్టాలు



తోడేళ్లదిబ్బలంకలో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు

వర్షం కారణంగా కల్లంలో మొలకెత్తిన కండెలు

మొక్కజొన్న రైతులకు అకాల వర్షాలతో కష్టాలు తప్పటం లేదు. పంట చేతికందే దశలో కురుస్తున్న అకాల వర్షాలు మొక్కజొన్న రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు అకాల వర్షాలతో పలు చోట్ల మొలకలు వస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పరదాలతో పంటను కాపాడుకోలేక అవస్థలు పడుతున్నారు.

– తోట్లవల్లూరు

ఎస్సీలకు లెదర్ ఫుట్‌వేర్ మేకింగ్‌పై శిక్షణ

కైకలూరు: ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 60 రోజుల పాటు లెదర్ ఫుట్ వేర్ మేకింగ్‌పై శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కైకలూరు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.వెంకటరత్నమ్మ తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెంది, 10వ తరగతి విద్యార్హతతో 19–35 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. గుంటూరు లేబర్ డిపార్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు పదో తరగతి మార్కుల లిస్టు జిరాక్స్, ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 99082 65031లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఘనంగా యోగా దినోత్సవం

పమిడిముక్కల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు యోగాసనాలు వేశారు. ఎంపీడీఓ వీర్ల సీతారామరాజు, ఏఓ రామకృష్ణ, ఈఓఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం వీరంకిలాకు సెంటర్‌లో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

యోగాతో ఆరోగ్యం

గుడ్లవల్లేరు: యోగాతో ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ టి.విజయసారథి, తహసీల్దార్ బి.లోకరాజు తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్రలో భాగంగా యోగ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

గుడివాడరూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు స్థానిక ప్రజావేదికలో అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జగన్మోహనరావు, సయ్యద్ గఫార్, సయ్యద్ జబిన్ పాల్గొన్నారు.





